రేపు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జూన్ 2వ తేదీ సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటవరకు కలెక్టరేట్ లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంటల కల్లా తప్పక హాజరుకావాలని కలెక్టర్ ఆదేశించారు. దీంతో పాటు నియోజకవర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నియోజక వర్గ, మండల స్థాయి అధికారులందరూ విధిగా హాజరు కావాలని ఆదేశించారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

జూన్ వచ్చెన్.. ఫీజుల టెన్షన్...

- ప్రారంభం కానున్న విద్యాసంవత్సరం
- 50 శాతం పెరిగిన పుస్తకాల ధరలు, ఫీజులు
- ఒక్కో కుటుంబంపై రూ 50 వేల నుంచి లక్షపైనే భారం
- హడలిపోతున్నా...అప్పులకూ వెనుకాడని వైనం

ప్రజాశక్తి- తిరుపతి

ఇన్నాళ్లూ వేసవి సెలవులతో విద్యార్థులు సేద తీరారు. అయితే వారి తల్లిదండ్రుల్లో అటెన్షన్ మొదలవుతోంది. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో 'వామ్మో జూన్ ' అంటూ హడలెత్తిపోతున్నారు. ఇపుడిపుడే తొలకరి వర్షాలు కురియడం, ఇదే సమయంలో ఎరువులు, విత్తనాలు కొనుగోలుకు పెట్టుబడులు పెట్టాల్సివస్తోంది. ఇంకో వైపేమో పిల్లల్ని బడుల్లో చేర్పించడం, అడ్మిషన్లు, పుస్తకాలు, బ్యాగులు, ఫీజులు, యూనిఫాం అంటూ బోలెడు ఖర్చుల గురించి ఆలోచించి సామాన్య, మధ్యతరగతి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఎల్‌కేజీ నుంచి పదో తరగతి, ఇంటర్మీడియెట్ వరకు టర్మ్‌ఫీజులు, బస్సు రవాణా, ఇతరాలు కలిపితే రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు ఖర్చు అవుతోంది. కార్పొరేట్ స్థాయికి వెళ్తే రూ.లక్ష వరకు ఖర్చు అవుతోంది. మరోవైపు హాస్టల్ ఫీజులు అదనపు భారం. ఇద్దరు, ముగ్గురు పిల్లలున్న తల్లిదండ్రులు వారి చదువుల ఖర్చులపై లెక్కలేసుకోవడమే కాకుండా అప్పుల కోసం వెతుకులాటనూ ప్రారంభించాల్సి వస్తోంది. ఇదే అదనుగా భావించిన కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలు అడ్డూ, అదుపు లేకుండా 'ఫీజులం' ప్రదర్శిస్తున్నాయి. దీంతో ప్రతి ఇంటిలోనూ రూ 50 వేల ఖర్చు నుంచి 1 లక్ష వరకు అదనపు భారం మోయాల్సి వస్తోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపో తుండటం గమనార్హం.

ప్రతీ ఏడాది మాదిరిగానే ఈ ఏడాదీ పుస్తకాలు, దుస్తులు, నోట్‌పుస్తకాల ధరలు పెరిగాయి. ఐదోతరగతి వరకు ప్రయివేటు యాజమాన్యాలు వారి ఇష్టమైన పుస్తకాలను బోధించుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో వారు చెప్పిన పుస్తకాలే కొనుగోలు చేయాల్సి వస్తోంది. ప్రయివేటు పాఠశాలల్లో ఒక్కో విద్యార్థికి రెండు స్కూల్ డ్రెస్సులతో పాటు శనివారం మరో ప్రత్యేకమైన డ్రెస్‌ను యాజమాన్యాలు కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి. ఒక్కో డ్రెస్ ధర పదిహేను వందల నుంచి రూ.మూడు వేల వరకు ఉన్నాయి. వీటితో పాటు స్కూల్ బ్యాగులు కూడా రూ.ఐదు వందల నుంచి రూ. వెయ్యి వరకు ఉంది. బూట్ల ధరలు కూడా ఒక్కో జత రూ. వెయ్యి నుంచి రూ.రెండువేల వరకు ఉన్నాయి. గతేడాది రూ.60 ఉన్న నోటు పుస్తకం ధర ఈ ఏడాది రూ.75 పైమాటే. గతేడాది ఆరో తరగతి విద్యార్థులకు నోటు పుస్తకాలకు రూ.వెయ్యి వరకూ ఖర్చయితే ఈ సంవత్సరం కనీసంగా రూ.1500 వరకూ వెచ్చించాల్సిన పరిస్థితి. కంపాక్స్ బాక్సులు, పెన్నులు, డ్రాయింగ్ బాక్సులు ఇలా వివిధ వస్తువులకు ఆయా తరగతులను బట్టి రూ.3 వేల నుంచి రూ.ఐదు వేల వరకూ ఖర్చవుతాయి. ఇలా సగటున ఒక్కో విద్యార్థికి జూన్ నెలలో ఖర్చు రూ.15వేల నుంచి రూ.30వేల వరకు అవుతోంది. ఇదంతా స్కూల్ ఫీజులు, డొనేషన్లు కాదు సుమా..! కేవలం ఇతర ఖర్చులే.. పైగా వీటన్నింటినీ ఆయా విద్యాసంస్థల ఆవరణలోని దుకాణాల్లో మాత్రమే కొనుగోలు చేయాలంటూ షరతులు విధిస్తుండటం శోచనీయం. ఇవి మార్కెట్‌లోని రేటుకంటే అదనంగా 30 నుంచి 50శాతం ఎక్కువ వసూలు చేస్తున్నాయి. ఈతతంగమంతా జీవో నెంబర్ 1, విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకమైనా విద్యాశాఖాధికారులు పట్టించుకోకపోవడం యాజమన్యాలకు విద్యావ్యాపారంతో పాటు పుస్తకాలు, దుస్తుల వ్యాపారం కూడా మూడు పువ్వులు ఆరుకాయలుగా సాగిపోతున్నది.

ఇద్దరికి లక్ష 30వేలయ్యింది : శ్రీనివాసులు, కాంట్రాక్టు ఉద్యోగి

నాకు ఇద్దరు పిల్లలు. ఒకరు 9వ తరగతి, మరొకరు 10వ తరగతి. ఎస్‌టివి నగర్‌లోని సాధారణ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. స్కూలు ఫీజు, యూనిఫాం, బుక్స్ తదితరాలన్నీ కలిపి లక్షా 30వేలు అవుతోంది. నాకు జీతం సక్రమంగా నెలనెలా రాకపోవడంతో ఏంచేయాలో దిక్కుతోచడం లేదు. జూన్ నెల వచ్చిందంటేనే భయం పట్టుకుంటుంది. స్నేహితుని అప్పు అడిగినా సర్దుబాటు కాలేదు.

నగలు తాకట్టు పెట్టాను సలీమా, తిరుమలనగర్

నాకు మూడో తరగతి చదువుతున్న పాప ఉంది. మా ఆయన ఓ బ్యాటరీ కంపెనీ ఫ్యాక్టరీలో పనిచేస్తారు. మంగళంలో ఉన్న సిబిఎస్సీ పాఠశాలలో చేర్పించాను. యూనిఫాం స్టేషనరీ కాకుండానే లక్ష రూపాయలు అవుతుందని తెగేసి చెప్పారు. పాప భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని బంగారు నగలను తాకట్టు పెట్టి మరీ స్కూల్లో చేర్పించాను. ఈ ఏడాదంతా ఆ అప్పు తీర్చుకుంటాను.

బయట కొంటే ఒప్పుకోరు : భారతి, మహిళా ఆటో డ్రైవర్

నేను రాస్ సంస్థ ద్వారా డ్రైవింగ్ నేర్చుకుని ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాను. నా ఇద్దరు పిల్లలు మంగళంలోని ఓ స్కూల్లో చదువుతున్నారు. వారికి యూనిఫామ్, టై, బ్యాడ్జి, షూ, బుక్స్, టెక్ట్స్ బుక్స్ ఇవన్నీ వారి స్కూల్లో కొనుగోలు చేయాల్సిందే. బయటకు వస్తే ఏమాత్రం ఒప్పుకోరు. మా దగ్గరే కొనాల్సిందేనంటూ తీవ్ర ఒత్తిడి తీస్తున్నారు. బయట మార్కెట్ రేట్ కి స్కూల్లో ధరకూ రెండింతలు తేడా ఉంటుంది. అయినా తప్పని స్థితిలో కొనుక్కోవాల్సి వస్తోంది.

'సర్'ప్లస్... హెల్ప్'లెస్'

- టీచర్లలో 'బదిలీ' ఆందోళన
- అయోమయంలో 457 మంది అయ్యోర్లు
- సర్దుబాటు జీవోపై జాప్యం
- చోద్యం చూస్తున్న విద్యాశాఖ

ప్రజాశక్తి- తిరుపతి

విద్యాశాఖలో సర్‌ప్లస్ పోస్టుల సర్దుబాటును సవరించడానికి అవసరమైన సవరణ జీవోల విడుదలలో జాప్యం తో ఉపాధ్యాయుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తం అవుతోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తరగతిలో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండో సెక్షన్‌ను మంజూరులో ఉపాధ్యాయల పోస్టుల భర్తీలో నష్టం వాటిలితే చూస్తూ ఊరుకోబోమంటూ ఉపాధ్యాయ సంఘాలు హెచ్చరిస్తున్నాయి. జిల్లాలో బదిలీకి దరఖాస్తు చేసుకున్న స్కూల్ అసిస్టెంట్లను సర్‌ప్లస్/ సర్దుబాటు నుంచి తప్పిస్తామని, వారి ట్రాన్స్‌ఫర్ అప్లికేషన్లను రద్దు పై ఎలాంటి స్పష్టత ఇవ్వకపోవడంతో పోరాటం తప్పదంటూ ఉపాధ్యాయ నేతలు పేర్కొంటున్నారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పాఠశాలల పునర్వ్యవస్థీకరణ మార్గదర్శకాల మేరకు సబ్జెక్టుల వారీగా టీచర్లను గుర్తించి, సంబంధిత పోస్టులను ఇతర పాఠశాలలకు సర్దుబాటు చేయడంలో ఇంకా స్పష్టత రాలేదు. సర్‌ప్లస్ స్కూల్ అసిస్టెంట్లుగా మొత్తం 457మందిని విద్యాశాఖ గుర్తించింది. నిబంధనల ప్రకారం సర్‌ప్లస్ ఉపాధ్యాయులందరూ బదిలీకి దరఖాస్తుచేయడానికి దాదాపుగా గడువు ముగియనుంది . అయినా ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు తరగతిలో విద్యార్థుల సంఖ్య 49 దాటితే రెండో సెక్షన్‌ను మంజూరు చేయడంతోపాటు, ఆ మేరకు ఇప్పటికే జరిగిన సర్‌ప్లస్ పోస్టుల సర్దుబాటును సవరించడానికి అవసరమైన సవరణ జీవోల విడుదలలో జాప్యం అవుతూనే ఉంది. అయితే విద్యార్థుల సంఖ్య 49 దాటినచోట్ల రెండోసెక్షన్ ఇచ్చేందుకు ఇటీవల ఉపాధ్యాయ సంఘాలతో ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన చర్చల సందర్భంగా అంగీకారం తెలిపింది. కానీ ఇంతవరకు సవరణ జీవోలు విడుదల కాకపోవడంతో తొలుత గుర్తించిన స్కూల్ అసిస్టెంట్లను తప్పనిసరిగా బదిలీ దరఖాస్తు చేయాల్సిందిగా అధికారులు ఒత్తిడి చేస్తున్నటం గమనార్హం.

అన్యాయం జరిగితే ఉద్యమిస్తాం ..

(ఫైల్‌ఫొటో)

- జీవి రమణ, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి

హైస్కూల్సులో 54మంది విద్యార్థులు ఉంటేనే 2వ పోస్టు కేటాయిస్తామనే వైఖరి తీసుకోవడం వల్ల ఉన్నత పాఠశాలల్లో వేలాది పోస్టులు ముఖ్యంగా గణితం, ఇంగ్లీషు స్కూలు అసిస్టెంట్ పోస్టులు సర్ ప్లస్ అవుతున్నాయి. మోడల్ ప్రైమరీ స్కూల్సుకు ప్రాధాన్యమిస్తూ ఫౌండేషన్ స్కూల్సు, బేసిక్ ప్రైమరీ స్కూల్సును నిర్వీర్యం చేస్తున్నారు. ఈ వైఖరి విద్యారంగానికి తీవ్ర నష్టం చేకూరుస్తుంది. ఉన్నత పాఠశాలల్లో 49మంది విద్యార్థులు ఉంటే 2వ సెక్షన్ ఏర్పాటు చేయాలి. ఫౌండేషన్, బేసిక్ ప్రైమరీ స్కూల్సులో 1:20 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలి. ఏప్రిల్ నాటి రోల్ ఆధారంగా పోస్టుల కేటాయింపు చెయ్యాలి. స్కూలు అసిస్టెంట్లను యుపి, హైస్కూల్సులోనే వినియోగించాలి. అట్లే బదిలీలు, ప్రమోషన్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలి. ముఖ్యంగా 2021 తర్వాత రెండుసార్లు రేషనలైజేషన్కు గురైన టీచర్లకు అదనపు పాయింట్లు కేటాయించి న్యాయం చేయాలి.

ప్రభుత్వ ఆస్పత్రి కనుమరుగేనా?

దశలవారీ పోరాటాలకు సిద్ధం అవుతున్న పోరాట కమిటీ

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: సుదీర్ఘ చరిత్ర కలిగి ఉమ్మడి చిత్తూరు జిల్లాలో సుదీర్ఘకాలం పేద, మధ్యతరగతి ప్రజలకు వైద్య సేవలు అందించిన జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కార్పొరేట్ వైద్య సంస్థ అపోలో పుణ్యమా అంటూ కనుమరుగయ్యే పరిస్థితులు నెలకొన్నాయి.

స్వాతంత్రం వచ్చాక చిత్తూరు నడిబొడ్డున ఉన్న ఆర్కాట్ నవాబు ఆధీనంలోని పది ఎకరాల స్థలంలో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని నెలకొల్పారు. నాటి నుండి చిత్తూరు జిల్లాలోని నగరి నుండి కుప్పం వరకు ఉన్న మండలాల్లోని పేదలకు వైద్య సేవలు అందించారు. చిత్తూరు పరిసర ప్రాంతాల్లో రోజుకు వందలాది సంఖ్యలో రోగులు వచ్చేవారు. వంద పడకల అస్పత్రి క్రమంగా 250 పడకల ఆస్పత్రిగా అభివృద్ధి చెందింది. చిత్తూరు జిల్లా కేంద్రంలో అపోలో యాజమాన్యం మెడికల్ కళశాలను ఏర్పాటు చేసేందుకు మురకంబట్టు వద్ద వందలాది ఎకరాలను కాజేశాక మెడికల్ కళాశాల ఏర్పాటుకు ఆస్పత్రి నిర్వహణ తప్పని సరి కావడంతో 2016లో నాటి టిడిపి ప్రభుత్వాన్ని ఒప్పించి 2016 లో 33 సంవత్సరాలు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని లీజుకు తీసుకుంది. ప్రభుత్వ ఆస్పత్రి అపోలో లీజుకు తీసుకుని సరిగ్గా 9 సంవత్సరాలు అవుతోంది. ఈ తొమ్మిది సంవత్సరాల్లో అపోలో అనేక ఆరోపణలు ఎదుర్కోవాల్సి వచ్చింది. రెఫరల్ అస్పత్రిగా మారిందంటూ రోగులకు సరైన వైద్య అందించడం లేదని, ప్రభుత్వ వైద్యులను నిర్లక్ష్యంగా చూస్తూ శిక్షణలో ఉన్న వైద్యుల ద్వారా రోగులను పరీక్షిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అనేక సందర్భాల్లో రోగులు ప్రత్యక్షంగా అపోలో నిర్లక్ష్యం కారణంగా ఆప్తులను కోల్పోయారంటూ ఆందోళలకు దిగిన సందర్భాలు అనేకం.. ప్రభుత్వంతో కుదుర్చుకున్న అవగాహన పత్రంలో ఎంఆర్ఐ, సిటీ స్కానింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామంటూ ఒప్పంద పత్రంలో పేర్కొన్నారు. అపోలో యాజమాన్యం ఏ ఒక్కటీ చేయలేదనే ఆరోపణలు వున్నాయి.

3న ఫోర్‌మెన్ కమిటీ విచారణ

ప్రభుత్వ ఆస్పత్రిలోని వివాదాలు, మరణాలు, రోగుల ఆరోపణలపై ఈనెల 3వ తేదీ ఫోర్‌మెన్ కమిటీ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో విచారణ చేపట్టనుంది. ఇలానే గతంలో రుయా ఆస్పత్రికి చెందిన త్రీమెన్ కమిటీ విచారించి అన్ని సక్రమంగా ఉన్నట్లు నివేదిక ఇచ్చింది. 3వ తేదీ చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో విచారణ చేపట్టనున్న ఫోర్‌మెన్ కమిటీ నిజానిజాలు నిగ్గుతేల్చి ప్రభుత్వ ఆస్పత్రిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు. మరోవైపు గతంలో అంటే 2024 సెప్టెంబర్‌లో జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని తమకు అప్పగించాలంటూ అపోలో యాజమాన్యం ప్రభుత్వానికి లేఖ సమర్పించింది. ఇలా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోవాలని అపోలో యాజమాన్యం పావులు కదుపుతూ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని కనుమరుగు చేసే ప్రయత్నం చేస్తోంది.

బాల కార్మిక నిషేధ చట్టం పకడ్బందీగా చేపట్టాలి

అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు కలెక్టర్ సూచన

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బాల కార్మికుల నిషేధ చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు కార్మిక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కృషి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ సూచించారు. శనివారం సాయంత్రం జిల్లా సచివాలయంలోని సమావేశపు మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన బాల, కౌమార కార్మిక వ్యవస్థ నిషేధ, నియంత్రణ చట్టం-(1986 సవరణ చట్టం -2016) సమర్థవంత అమలుకు సంబంధించి సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో కార్మిక శాఖ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల, కౌమార కార్మిక వ్యవస్థ చట్టం- 1986 (సవరణ చట్టం 2016) మేరకు సెక్షన్ 3 కింద ఏ వృత్తిలో అయినా, ఏ ప్రక్రియలో అయినా 14 సంవత్సరాల లోపు బాలబాలికల వద్ద పని చేయించుకోవడం లేదా పనిలోకి అనుమతించడం పూర్తిగా నిషేధం అన్నారు. సెక్షన్ 3 ఎ కింద 14 సంవత్సరాల వయసు నిండిన 18 సంవత్సరాల వయస్సు పూర్తి కాని కౌమార వయస్సులో ఉన్న వారి వద్ద నిర్దేశిత ఏ, బి షెడ్యూల్లో పేర్కొన్న నిషేధిత ప్రమాదకర వృత్తులు, ప్రక్రియలో పని చేయించుకోవడం, పని లోకి అనుమతించడం పూర్తి గా నిషేధమని, ఈ సెక్షన్ల లను ఉల్లంఘించిన వారికి ఆరు నెలల నుండి రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష, 20 వేల నుండి 50 వేల వరకు జరిమానా విధిస్తారన్నారు. బాల కార్మికుల గురించి ఏదైనా ఫిర్యాదుకు చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ 1098 ని సంప్రదించవచ్చునని తెలిపారు. ఈ సమావేశంలో కార్మిక శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

కార్మిక శాఖాధికారులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులతో చర్చిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

సిఎం సహాయ నిధి చెక్కు పంపిణీ



చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కార్వేటినగరం: కార్వేటి నగరం మండలం ఆర్ కె వి బి పేట గ్రామానికి చెందిన పి హేమాద్రి రెడ్డికి రెండు లక్షల రూపాయల చెక్కును ప్రభుత్వ విప్, గంగాధర నెల్లూరు నియోజవర్గ ఎమ్మెల్యే డాక్టర్ థామస్ శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ రైతు అధ్యక్షులు నగలపాటి నాగేశ్వరరాజు, టిడిపి మండల అధ్యక్షులు చెంగల్రాయ యాదవ్, మాజీ వైస్ ఎంపీపీ రవికుమార్, ధర్మరాజుల గుడి అధ్యక్షులు రవి యాదవ్, చంద్రమౌళి రెడ్డి పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న రైతులు

మామిడి రైతుల గోడు పట్టదా?

- గిట్టుబాటు ధర కల్పించాలి
- ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి
- మామిడి రైతుల నిరసన

ప్రజాశక్తి -కార్వేటినగరం: 'దేశానికి వెన్నెముక అయిన రైతుల గోడు కూటమి ప్రభుత్వానికి పట్టదా?' అని వైసిపి మాజీ మండల కన్వీనర్, స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ ప్రశ్నించారు. శనివారం మండల కేంద్రంలోని గాండ్లమిట్ట కూడలిలో మామిడి రైతులు పెద్ద ఎత్తున పార్టీలకు అతీతంగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా రైతులు అత్యధికంగా సాగుచేసే పంట మామిడికి గిట్టుబాటు కల్పించి మామిడి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే మామిడి సాగుకు రైతులు అత్యధికంగా పెట్టుబడులు పెట్టి గిట్టుబాటు ధర లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమని అంటున్నారన్నారు. బీజేపీ కిసాన్ మోర్చ అధ్యక్షుడు యువరాజు మాట్లాడుతూ మామిడికి గిట్టుబాటు ధర కల్పించక పోతే దిగుబడి కోసం అప్పులు చేసి పెట్టుబడులు పెట్టిన రైతులు ఆత్మహత్యలకు పాల్పడే అవకాశం ఉందని ప్రభుత్వం మొండి వైఖరిని వీడి వెంటనే మామిడి రైతులను ఆదుకునే విధంగా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ధర్నాలు, నిరసనలతో ప్రభుత్వ మెడలు వంచేందుకు రైతులు వెనుకాడ బోరన్నారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం రైతులు సంఘాలు ఏర్పాటు కావాల్సిన అవసరం ఎంతైనా ఉన్నారు. మండీలు, ప్యాక్టరీల వద్ద డ్యాష్ ఏర్పాటు చేసి అందులో ధరల పట్టికను ఉంచాలని, మండీ వ్యాపారస్తులు, కంపెనీలు సిండికేట్ కాకుండా రైతులు పండించిన మామిడిని కొనుగోలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఏఐకేఎంఎస్ నాయకులు మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన మ్యాంగో బోర్డు ఏర్పాటు చేయాలని, జ్యూస్ ఫ్యాక్టరీలో ఉన్న పల్పును బోర్డు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. మామిడి పంటకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని, అంతరాష్ట్రాల నుంచి వచ్చే కాయలను నిలుపుదల చేయాలని కోరారు. మామిడి రైతులకు ఇన్సూరెన్సు కల్పించి ఆదుకోవడమే కాకుండా, పంటబీమా కల్పించి, పురుగుల మందులను ప్రభుత్వమే రాయితీపై అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో పండే మామిడికే ఫ్యాక్టరీ యాజమాన్యం మొదటి ప్రాధాన్యత కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీగా వెళ్లి మండల తహశీల్దారు నాగరాజుకు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు రోహిత్, శివప్రకాష్ మొదలి, ధనశేఖర్‌మొదలి, కుప్పారెడ్డి, గౌతమ్, ప్రభాకర్‌రెడ్డి, త్యాగరాజు, సుబ్రమణ్యంరాజు, షణ్ముగం, పయణిరెడ్డి, బాబురెడ్డి మండల రైతులు పాల్గొన్నారు.

రెడీమేడ్ దుస్తుల పోటీ

- గ్రామీణ టైలర్ల భవిష్యత్ ప్రశ్నార్థకం
- ప్రభుత్వం స్పందించాలని వినతి

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: కార్పొరేట్ సంస్థల రెడీమేడ్ దుస్తులు పోటీగా మారాయి. దీంతో మండలంలో గ్రామీణ టైలర్లు ఉపాధి లభించక ఆదరణ కోల్పోతున్నారు.ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులపై యువకులు ఆసక్తి చూపుతూ వాటినే కొనుగోలు చేస్తున్నారు. దీంతో భవిష్యత్‌లో గ్రామీణ ప్రాంతాల టైలర్లకు పని దొరక్క పూర్తిగా ఆదరణ కరువుతుందని స్థానికులు విశ్లేషిస్తున్నారు. ప్రస్తుతం టైలరు వృత్తిని నేర్చుకునేటందుకు యువత ముందుకు రావడంలేదని రాబోయే రోజుల్లో చేతి పనులకు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం వుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టైలర్లు కుట్టిన దుస్తులు యువత తొడుక్కునేందుకు ఇష్ట పడడం లేదు. డిజైన్ దుస్తులు ధరించి ఫ్యాషన్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఆ రకమైన దుస్తులను ప్రస్తుత టైలర్లు కుట్టలేకపోతున్నారు. ఒకవేళ కుట్టినా వాటిని ధరించేందుకు యువత అయిష్టం చూపుతున్నారని టైలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గంగాధర నెల్లూరు మండలంలో 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి ఈ పంచాయతీలలో ఉన్న గ్రామాలలో ఇద్దరు లేదా ముగ్గురు టైలర్లు ఉండేవారు. వారి దగ్గరే యువకులు, పెద్దవారు, మహిళలు దుస్తులు కుట్టించుకుని ధరించేవారు. అప్పట్లో టైలర్ అంటే అంత గౌరవం మర్యాదలు ఉండేవి. వారి దగ్గర కూర్చొని మరి వారి దుస్తులను కుట్టించుకుని వెళ్లేవారు.

గత పరిస్థితి ఇలా...

15 సంవత్సరాల క్రితం గంగాధర నెల్లూరు ప్రాంతల టైలర్ల దగ్గరకు తీసుకెళ్లి కుట్టించుకునే వారు. ఎక్కడ చూసినా ఒకే రకమైన దుస్తులు ఇటు అటుగా ఉండేవి. కాలం మారే కొద్దీ ఎక్కడో ఒకరి దగ్గర ప్యాంటు, షర్టు కుట్టించుకుని ధరించుకునేవారు. అప్పట్లో ఆ దుస్తులకి అంత ఆదరణ ఉండేది. టైలర్లకు కూడా చేతినిండా పని దొరికి కుటుంబ ఖర్చులకు సరిపడా డబ్బులు అంది టైలర్ల జీవనం సాఫీగా సాగేది.

టైలర్ సుబ్రహ్మణ్యం రెడ్డి

గ్రామాలలో పండుగ వచ్చిందంటే కుటుంబంలో అందరికీ షాపులో దుస్తులు తీసుకొచ్చే వారు. వాటిని గ్రామీణ

టైలర్లకు ఆదరణ కరువు

మండలంలో గ్రామీణ టైలర్ల దగ్గర కుట్టించుకుని దుస్తులు వేసుకునే మనుషులే కరువయ్యారు. పట్టణాల వైపు మక్కువతో అక్కడకు వెళ్లి రెడీమేడ్ దుస్తులు కొనుగోలు చేసి వేసుకుంటున్నారు. మహిళలు సైతం మహిళా టైలర్ల వద్ద దుస్తులు ఇచ్చి కుట్టించుకోవడం తగ్గిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో మహిళా టైలర్లకు ఆదరణ లేకుండా పోయింది. ఇటు జెంట్స్, లేడీస్ టైలర్లకు నేడు జీవనోపాధి కరువైందని వాపోతున్నారు.

ఆన్‌లైన్ రెడీమేడ్ దుస్తులతో పని కరువు

ఆన్‌లైన్ రెడీమేడ్ దుస్తులు రావడంతో మాకు పని తగ్గిపోయింది.. నేను 15 సంవత్సరాలుగా ఈ టైలర్ వృత్తిని చేస్తున్నాను. గతంలో పని బాగా ఉండేది. ప్రస్తుతం రెడీమేడ్ దుస్తులతో ఈ పని తగ్గిపోవడంతో నేను వేరే పని వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

- సూర్య, టైలర్. లంబోదరపల్లి దళితవాడ, జిడి నెల్లూరు మండలం.

గతంలో చేతి నిండా పని ఉండేది

గతంలో ఎప్పుడూ చేతి నిండి టైలర్ పని ఉండేది. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్‌లో మాత్రమే టైలర్ పని ఉంటోంది. పండుగలు వస్తే ఏదో కొంతవరకు పని ఉంటుంది. మిగిలిన రోజుల్లో అంత ఎక్కువగా టైలర్ పని ఉండడం లేదు. ఆన్‌లైన్ రెడీమేడ్ దుస్తులు వల్ల మాకు చాలా వరకు పని తగ్గిపోయింది.

- మధుమతి, లేడీస్ టైలర్, తూగుండ్రం గ్రామం, జిడి నెల్లూరు మండలం.

రానురాను పని తగ్గిపోతోంది..

రాను రాను జెంట్స్ వర్క్ తగ్గిపోతోంది. రెడీమేడ్ జీన్స్, టీ షర్టు వచ్చేయడంతో వాటిని ఎక్కువగా యువకులు కొనుక్కుంటుండడంతో పని తగ్గిపోతోంది. ప్రస్తుతం జెంట్స్ వర్క్ చేసేవారు తగ్గుతున్నారు. నేను సుమారు 30 సంవత్సరాలుగా ఈ టైలర్ వృత్తిని చేస్తున్నాను. గతంలో ఈ పని నేర్చుకోవడానికి ఎక్కువ మంది వచ్చేవారు. ప్రస్తుతం ఈ వృత్తిని నేర్చుకునే వారు కరువయ్యారు. నేను టైలర్ పని నేర్చుకునేటప్పుడు పెళ్లిళ్లు వస్తే ఆ పెళ్లి వారి ఇంటి దగ్గరికి కుట్టు మిషన్ తీసుకుని వెళ్లి అక్కడే ఉండి ఆ పెళ్లి దుస్తులు కొట్టి ఇచ్చేవాళ్లం. గత ప్రభుత్వం ఏడాదికి టైలర్లకు పదివేల రూపాయలు ఆర్థిక సాయం చేసింది. ఇప్పుడు మా టైలర్లకు ప్రభుత్వం ఆదరణ పథకం అమలు చేసి మాకు టైలర్ మిషన్లు ఇస్తే బాగుంటుంది.

- శివకుమార్, టైలర్, తూగుండ్రం గ్రామం, జిడి నెల్లూరు మండలం.

ఎమ్మెల్యేకు సన్మానం

ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రేషన్ డీలర్లు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజక వర్గ రేషన్ డీలర్లు పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డిని శనివారం ఘనంగా సన్మానం చేశారు. రేపటి నుంచి రేషన్ దుకాణాలలో డీలర్ల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణీకి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ పలమనేరు రూరల్, గంగవరం, పెద్దపంజాణి, బైరెడ్డి పల్లి మండలంలోని డీలర్లు ఎమ్మెల్యేను సన్మానించారు. స్థానిక టిడిపి కార్యాలయంలో కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తంచేశారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పారదర్శకంగా నిత్యావసరాలు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు విశ్వనాథ రెడ్డి, మునిరత్నం, వినోద్, మోహన్ రామిరెడ్డి,బసవరాజు, నరసింహారెడ్డి, రవిస్వామి, ప్రకాష్, గంగిరెడ్డి పాల్గొన్నారు.

పిహెచ్‌సి రికార్డుల తనిఖీ

పిహెచ్‌సి రికార్డులు తనిఖీ చేస్తున్న డిఎంహెచ్ఓ అనిల్

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రం సోమల లోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రోగ్రాం ఆఫీసర్, డీఎంహెచ్ఒ అనిల్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య కేంద్రానికి వస్తున్న నిధులు, చేస్తున్న ఖర్చులు, సౌకర్యాలపై ఆరా తీసి సిబ్బందికి సలహాలు, సూచనలు అందించారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు క్రమం తప్పకుండా అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జయసింహ, సిహెచ్ఓ అమరనాథ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కైలాస ధామానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చిత్తూరు కైలాస ధామం నిర్మాణానికి తన వంతు సహాయ సహకారంగా తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నాలుగు లక్షల రూపాయలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి ఎమ్మెల్యే గా ఉన్నా చిత్తూరు ప్రజల అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జనసేన ఇన్‌ఛార్జి ఆరణి శివకుమార్, లయన్స్ క్లబ్ ఆఫ్ గోల్డ్, చిత్తూరు ఆర్యవైశ్య సంఘం సభ్యులు, చల్లా ద్వారకనాథ్, ఆరూరు రామమూర్తి, బిలంకూరు వెంకటేష్, ఓఆర్ నాగేంద్ర, శ్రీనివాసమూర్తి బైసాని చంద్రశేఖర రావు పాల్గొన్నారు.

టిడిపి నాయకుడి సతీమణి మృతికి సంతాపం

ప్రజాశక్తి-పెద్దపంజాణి: మండలం టిడిపి నాయకులు కోనేరు వెంగారెడ్డి సతీమణి , మాజీ సర్పంచ్, జిల్లా పార్లమెంటరీ టిడిపి నాయకురాలు ఎస్ వరలక్ష్మి మూడురోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందారు. ఆమె మృతి పట్ల పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి కోనేరు లోని వెంగారెడ్డి స్వగృహానికి వెళ్లి సంతాపం తెలిపారు. వారి కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె చిత్ర పటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మురారి రెడ్డితో పాటు పంచాయతీ టిడిపి నాయకులు పాల్గొన్నారు.

పలమనేరు రెండవ స్థానం

ప్రజాశక్తి- పలమనేరు: చిత్తూరు జిల్లాలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీలో పలమనేరు రెండవ స్థానంలో ఉందని .పలమనేరు మున్సిపల్ కమిషనర్ ఎస్ రమణారెడ్డి తెలిపారు.

96 శాతం పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలంలో శనివారం సామాజిక పింఛన్ల పంపిణీ 96 శాతం పైగా పంపిణీ చేశారని ఎంపీడీవో నారాయణ తెలిపారు. 7131 మంది పింఛను లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేసినట్లు తెలిపారు.

పలు అభివృద్ధి పనులపై చర్చ

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పురపాలక సంఘ కార్యాలయము కౌన్సిల్ హాలులో శనివారం సాధారణ సమావేశం చైర్ పర్సన్ చాముండేశ్వరి, అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ రమణారెడ్డి పట్టణంలో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులపై కౌన్సిల్ ముందు ప్రవేశపెట్టారు. పలమనేరు పట్టణంలో జాతీయ రహదారి మధ్యన చేపట్టబోయే అంబేద్కర్ సర్కిల్ నుండి గంగవరం మండలం పై ఓవర్ వరకు రహదారి మధ్యన పెండింగ్ లో ఉన్న ఎల్ఈడి వెలుగులో డివైడర్ నిర్మాణం చేపట్టడానికి, రెండు చోట్ల (కూరగాయల మార్కెట్లో ఒకటి బస్టాండ్లో లో పార్కు పక్కన ఒకటి ,) మరుగుదొడ్ల ,ప్రతిపాదన చేయగా కౌన్సిల్ ఆమోదం తెలిపినట్లు ఆయన పేర్కొన్నారు. ఆ పనులను త్వరలో పూర్తి చేయాల్సిన అవసరం వుందన్నారు. ఈ సాధారణ సమావేశంలో వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

దురుసు ప్రవర్తన వద్దు

వైద్య సిబ్బందికి డిఎంహెచ్ఓ సూచన

రోగుల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డిఎంహెచ్ఓ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: రోగులతో దురుసుగా ప్రవర్తించ వద్దని డిఎంహెచ్ఓ సుధారాణి వైద్య సిబ్బందికి సూచించారు. మండల కేంద్రం లోని ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని, ఆస్పత్రికి వచ్చే రోగులను వాళ్లని పరీక్షించి తగిన వైద్యం, మందులు అందిస్తూ ప్రజలకు సేవలందించాలని పేర్కొన్నారు. అనంత రం ప్రభుత్వ ఆసుపత్రిలో సౌకర్యాలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య అధికారి శిరీష వైద్యులు శాలిని, అఖిల్, రాగ భావన, విజయ్ కుమార్, ఐసియూ ప్రధాన ఆరోగ్య కార్యకర్త సుమతి బాయ్, రిజ్వాన్, కవిత, శిలావతి, బాబు, మాధవి పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: మండలం లోని మొగిలి వెంకటగిరి మాజీ సర్పంచ్ ఆర్థీ మూర్తి అనారోగ్యంతో శనివారం మృతి చెందాడు. ఆయన మృత దేహాన్ని పలువురు ప్రజా ప్రతినిధులు సందర్శించి నివాళు లర్పించారు.

టిడిపి నాయకుడికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే థామస్

టిడిపి నాయకునికి నివాళి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం : ఎస్ఆర్పురం మండలంలోని గొల్లప ల్లి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు బోడపాటి లోకనాథ నాయుడు అన్న సుబ్రహ్మణ్య నాయుడు శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యే డాక్టర్ థామస్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి చినబాబు ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బోడపాటి లోకనాథ నాయుడుని పరామర్శించారు. ఆయన కుటుంబానికి టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్ణాటక మాజీ మంత్రి కట్ట సుబ్రహ్మణ్యం, టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గంధమనేని జయశంకర్ నాయుడు, చిట్టిబాబు నాయుడు, రాజశేఖర్ నాయుడు, మునివర్ధ నాయుడు, కమ్మ సంఘం నేతలు, నివాళులర్పించారు.

ఎస్‌సి, ఎస్‌టిలకు జైబీమ్ ఫౌండేషన్ అండ

ప్రజాశక్తి -కార్వేటినగరం: రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాలకు జై బీమ్ ఫౌండేషన్ అండగా నిలుస్తోందని ఆ పౌండేషన్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని హిందూ–ముస్లిం కల్యాణ మండపంలో జైబీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ అధ్యక్షుడు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు చెందిన పేదవారు ఎక్కడ వున్నా సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం జై బీమ్ ఫౌండేషన్ అడ్వైజర్ విశ్రాంత ఉపాధ్యాయుడు పి గుర్రప్ప మాట్లాడుతూ జై బీమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఎస్సీ, ఎస్టీలపై జరుగుతున్న దౌర్జన్యాలపై పోరాటం చేయడానికి సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. దాడులు మళ్లీ పునరావృతం అయితే గుణపాఠం చెప్పడానికి జై బీమ్ ఫౌండేషన్ వెనుకాడ బోదన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ నరేష్, ట్రెజరర్ అనిల్ కుమార్, జైబీమ్ పౌండేషన్ సభ్యులు ఉపాధ్యాయుడు వెంకటేష్, రాజ్‌కుమార్, ప్రవీణ్, పరందాం, కిరణ్, బొబ్బిలి, ప్రశాంత్, వేణు పలువురు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించొద్దు: ఎస్ఐ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమలలో ప్రతి శనివారం నిర్వహించే వారపు సంతలో వ్యాపారాలు నిర్వహించుకునే వ్యాపారస్తులు, సంత వెలుపల రోడ్డుపై వ్యాపారం చేసే వ్యాపారస్తులు వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని ఎస్ఐ శివశంకర్ అన్నారు. శనివారం వారపు సంత నిర్వహణ ట్రాఫిక్ ఇబ్బందులు పరిశీలించారు. అనంతరం బ్రీత్ అనలైజర్ ద్వారా మద్యం సేవించారా? అని వాహన చోదకులకు పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి - పెద్దపంజాణి: మండలానికి చెందిన రేషన్ డీలర్లు పలమనేరు శాసన సభ్యులు అమరనాథ రెడ్డిని తన కార్యాలయంలో శనివారం కలసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్థానిక టిడిపి కార్యాలయంలో కేక్‌కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల డీలర్ల సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి-గుడిపాల: చెడు అలవాట్లు దూరంగా ఉండాలని డాక్టర్లు సంధ్య, రష్మిత అన్నారు. శనివారం మండలంలోని గుడిపాల, బొమ్మసముద్రం పిహెచ్‌సిలో పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ర్యాలీ, అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ బీడీ, సిగరెట్ , పాన్ పరాక్, గుట్కా వంటి వాటికి దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ బాల సూర్య నారాయణ, హెల్త్ సూపరువైజర్ విజయ, చంద్రశేఖర్ , వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని బైరెడ్డిపల్లి మండల వైద్యాధికారి డాక్టర్ విజయచంద్ర ఆధ్వర్యంలో నిర్వహించారు. తమ సిబ్బందితో మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుండి ర్యాలీ నిర్వహించి పొగ తాగడం ఆరోగ్యానికి హానికరమని, పొగాకు, పొగాకు ఉత్పత్తులు వాడటం వల్ల శరీరంలో కలిగే అనర్థాల గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ మంచి అలవాట్లను అలవరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విజయ్ చంద్ర, డాక్టర్ శాలిని, సూపరువైజర్లు, ల్యాబ్ టెక్నీషియన్ జిలాని, ఫార్మసిస్టు సారామతి, సిబ్బంది పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లిలో

గంగవరంలో

గంగవరం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గంగవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు డాక్టర్ లహరి ఆధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు పొగ తాగడం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. పొగాకు వ్యతిరేక పోరాటంలో భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు .

వెదురుకుప్పం: ప్రపంచ ధూమపాన వ్యతిరేక దినోత్సవం సందర్భంగా డాక్టర్ హేమశ్రీ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పచ్చికాపల్లంలో ర్యాలీ నిర్వహించారు. 'మత్తు పదార్థాలు వద్దు.. ఆరోగ్యం ముద్దు.. పొగ తాగొద్దు..' అంటూ అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమం లో డాక్టర్ చెంగారెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ డేవిడ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు బస్టాండ్ కూడలి వరకు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారిణి విజయలక్ష్మి, వైద్యాధికారి నీలిమ, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

4న నిరసనను జయప్రదం చేయాలి

వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ కుమార్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: ఈ నెల 4వ తేదీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌ఛార్జి సునీల్ కుమార్ పేర్కొన్నారు. శనివారం మండలంలోని తగువారిపల్లిలో కార్యకర్తల సమావేశం మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 4వ తేదీ ఆంధ్రప్రదేశ్ బ్లాక్ డేగా వైసిపి నిర్ణయించిందని గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చక పోవడంతో గత జూన్ 4వ తేదీ వెలువడిన ఎన్నికల ఫలితాలు వచ్చి సంవత్సరం పూర్తి అవుతున్న సందర్భంగా చెప్పిన హామీ లను నెరవేర్చక పోవడంతో ప్రజల్లో అసంతృప్తి ఎక్కువ గా ఉందన్నారు. ప్రతిపక్ష పార్టీ నిరసన కార్యక్రమాలను, నియోజకవర్గ స్థాయిలో పార్టీ నిర్ణయించిందని ఈ కార్యక్రమా లకు అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్య కర్తలు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ మాజీ ఛైర్మన్ కుమార్ రాజా, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్ రెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఫిరోజ్ అహ్మద్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, భారతి, రాజా మాజీ సర్పంచులు కృష్ణమూర్తి, ప్రకాష్ రెడ్డి, గోవిందరాజులు, అశోక్ రెడ్డి సేవాదళ్ అధ్యక్షులు కిషోర్ కుమార్ రెడ్డి యువత అధ్యక్షులు గజేంద్ర పలువురు వైసిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

మా స్థలం కబ్జా చేశారు..

- రక్షణ కల్పించి స్థలం ఇప్పించండి
- రెవెన్యూ అధికారులకు ఓ దళిత విశ్రాంత ఉద్యోగి వేడుకోలు

ప్రజాశక్తి -పుంగనూరు: పట్టణానికి సమీపంలో ఫాల్కన్ డెవలపర్స్ పుంగనూరు సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో రిజిస్ట్రేషన్ అయిన లేఅవుట్ స్థలం కబ్జా చేసి ఆనవాళ్లు కనపడకుండా జెసిబితో చదును చేసి చుట్టూ ప్రహరీ నిర్మించుకున్నారని, వారి నుంచి తమకు రక్షణ కల్పించి తమ స్థలాన్ని మాకు అప్పగించేందుకు కలెక్టర్, తహశీల్దారు చర్యలు తీసుకోవాలని విశ్రాంత దళిత ఉద్యోగి అభ్యర్థించాడు. దీనిపై స్థానిక తహశీల్దారు కు శనివారం వినతి పత్రం అందించాడు. బాధితుడి కథనం మేరకు.. పుంగనూరు మండలం మేలం దొడ్డి గ్రామ పంచాయతీ రెవెన్యూ గ్రూపులో సర్వేనెంబర్ 23. 2లో బెంగళూరుకు చెందిన కొందరు లేఅవుట్ వేసి 2012లో విక్రయించారన్నారు. ఈ స్థలం సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో ప్లాట్ నెంబర్ 105గా రిజిస్ట్రేషన్ చేసుకున్నామని తెలిపాడు. ఎనిమిది నెలల క్రితం పాల్కన్ డెవలపర్స్ పేరుతో బోర్డు ఏర్పాటు చేసి అప్పుడున్న ప్లాట్లు చదును చేసి ప్రహరీ నిర్మించుకున్నారని పేర్కొన్నాడు. తమ స్థలం వద్దకు వెళ్లాలన్నా భయమేస్తోందని, వారి నుంచి కబ్జా అయిన స్థలం అప్పగించాలని, వారి నుంచి పూర్తి రక్షణ కల్పించాలని కోరారు. తాను ఓ దళిత విశ్రాంత ఉద్యోగి అని ఉద్యోగ విరమణ సమయం లో వచ్చిన డబ్బులతో ఆ స్థలాన్ని కొనుగోలు చేశానని తనకు వేరే ఇతర ఆస్తులు ఏమీ లేవని తమ సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్, పుంగనూరు తహశీల్దారు రాముకు వినతిపత్రం అందించారు.

అధికారులను పంపిస్తా: తహశీల్దారు

ఓ దళిత విశ్రాంతి ఉపాధ్యాయ స్థలాన్ని కబ్జా చేశారని స్థానిక తహశీల్దారుకు వినతి చేశారు. రికార్డును పరిశీలించిన తహశీల్దారు అధికారులను పంపించి అక్కడి సమస్యను తెలుసుకొని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

టిడిపి నాయకులచే రేషన్ షాపులు ప్రారంభించాలి: తహశీల్దారు

ప్రజాశక్తి -చిత్తూరు(యాదమరి): ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల అవసరం లేదు... అధికారులు అవసరం లేదు..టిడిపి నాయకులు, కార్యకర్త అయినా పర్లేదు వారి చేతుల మీదుగా రేషన్ షాపులను ప్రారంభించాలని యాదమరి తహశీల్దార్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి అందించే నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే వాహనాలను రద్దు చేసింది. దీనిపై జూన్ 1వ తేదీ నుంచి డీలర్లు తమ షాపులు వద్దే నిత్యావసర వస్తువులు లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ఆదేశాలు జారీ చేసింది. దీనిపై జూన్ ఒకటో తేదీ నుంచి నిత్యావసర వస్తువులను డీలర్లు తమ షాపులు వద్దే పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించాలని తహశీల్దారు ఆదేశించారు. దీంతో డీలర్లు అవాక్కయ్యారు. అంతేగాక 47 డీలర్ షాపులను ప్రారంభించే టిడిపి నాయకులు పేర్లతో సహ తహశీల్దారు డీలర్లకు అందించడం గమనార్హం. అంతేగాక తన వాయిస్ మెసేజ్ లో ప్రతి డీలరు మీ పంచాయతీకి చెందిన టిడిపి లీడర్ల పేర్లు ఇచ్చామని వారి వద్దే ప్రారంభించాలని ఆదేశించడంతో డీలర్లు ఏమి చేయాలో అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

వీఆర్‌వో మానవత్వం

స్విమ్స్‌లో లబ్ధిదారుడికి పింఛను అందజేత

ప్రజాశక్తి -యాదమరి: యాదమరి మండలం కొట్టాలం గ్రామానికి చెందిన లోకేష్ సిమ్స్ హాస్పిటల్ లో డయాలసిస్ చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో ఉన్నాడు. శనివారం సాటి మనిషికి సహాయం చేయాలనే మానవత దృక్పథంతో ఎన్టీఆర్ పెన్షన్ డబ్బులను కొట్టాలం గ్రామ రెవెన్యూ అధికారి సురేష్ తిరుపతిలోని స్విమ్స్ ఆసుపత్రికి వెళ్లి 15వేల రూపాయల పెన్షన్ వారికి అందించారు. వైద్య ఖర్చులకు ఇబ్బంది పడుతున్న తరుణంలో 15 వేల రూపాయలు పెన్షన్ డబ్బులు ఆసుపత్రికి వెళ్లి అందించడంతో కుటుంబ సభ్యులు విఆర్ఓ సురేష్ కు కృతజ్ఞతలు తెలిపారు.

క్రైం న్యూస్

వేటగాడు అరెస్ట్

అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న తుపాకీ, జంతు చర్మం

ప్రజాశక్తి- కుప్పం రూరల్ : వన్యప్రాణులను వేటాడిన నేరం కింద కుప్పం మండలం వాలూరు గ్రామానికి చెందిన దేవరాజు కుమారుడు కనక రాజును అదుపులోకి తీసుకున్నా మని కుప్పం అటవీ శాఖ అధికారి జయశంకర్ తెలిపారు. శనివారం ఆయన స్థానిక అటవీ శాఖా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ శుక్రవారం అజ్ఞాత వ్యక్తి ఇచ్చిన సమాచారం మేరకు గుడు పల్లి మండలం మల్లప్ప కొండ అటవీ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ తనిఖీలలో దుప్పి మాంసం, చర్మం కలిగివున్న కనకరాజును అదుపులోకి తీసుకుని, వేటకు ఉపయోగించిన నాటు తుపాకీతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇతనిపై చట్టరీత్యా కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వన్యప్రాణులను వేటాడడం, వాటికి హాని కలిగించేలా ప్రవర్తించడం వంటివి చట్టరీత్యా నేరమని, వీటిపై ప్రజలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నామని తెలిపారు. వన్యప్రాణులకు హాని కలిగేలా ప్రవర్తించిన వారు ఎంతటి వారైనా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సమావేశంలో అటవీశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండలంలో శనివారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మోటారు వాహనాల కేసులు 20 పైగా నమోదు చేసి ఆన్లైన్ ద్వారా పెనాల్టీలు విధించారు. టాటా ఏసీ డ్రైవర్ మద్యం చేయించి డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించి వారిపై డ్రంక్అండ్ డ్రైవ్ కేసు నమోదు చేసి టాటా ఏస్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని స్థానిక ఎస్ఐ పరశురాముడు శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు.

టిడిపి మహిళా కార్యకర్తల మృతికి ఘన నివాళి

ప్రజాశక్తి - రామకుప్పం: మండల కేంద్రంలోని సీనియర్ టిడిపి నేత సజ్జల కోదండ రెడ్డి మాతృమూర్తి మునెమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. శివాజీ నగర్ కాలనీలో టిడిపి మహిళా కార్యకర్త లక్ష్మమ్మ మృతి చెందగా శనివారం వారి కుటుంబానికి టిడిపి నేతలు 10 వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. మహిళా కార్యకర్తల మృతికి టిడిపి నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, మాజీ సర్పంచ్ రామకృష్ణప్ప, నేతలు శ్రీరాములు రెడ్డి,సుబ్రీ, బాలు,జయశంకర్, వెంకటరమణ, విజయ్ కుమార్ రెడ్డి, టీవీ రవి, పద్మనాభరెడ్డి, గిరి దాసు, సత్తి ,ఆదిల్, సురేష్ పాల్గొన్నారు.

నేటి నుండి చౌక దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ: జేసి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా జూన్ 1వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా రేషన్ పంపిణీని రేషన్ షాపుల ద్వారా మాత్రమే పంపిణీ చేయనున్నట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ రేషన్ పంపిణీ కార్యక్రమం డీలర్ల ద్వారా ఆదివారాలు, సెలవు దినాలతో సహా.. 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు 15 రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. నిత్యావసర సరుకులు ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కార్డుదారులకు పంపిణీ చేస్తారని తెలిపారు. అంగ వైకల్యం ఉన్నవారు లేదా అనారోగ్యంతో మంచం మీద ఉన్న కార్డుదారుల ఇంటి వద్దకే.. డీలరు 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుండి 4 గంటల లోపల రేషన్ సరుకులను పంపిణీ చేస్తారని జేసీ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పెద్దపంజాణి: నేటినుంచి ప్రభుత్వ చౌక దుకాణాల ద్వారా రేషన్ డీలర్ తో రేషన్ పంపిణీ చేయనున్నట్లు స్థానిక తహశీల్దార్ సిఎస్ అనిల్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఆర్డీవోకు సన్మానం

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన రేషన్ డీలర్లు పలమనేరు ఆర్డీవో భవానికి శనివారం ఘనంగా సన్మానం చేశారు. రేపటి నుంచి రేషన్ దుకాణాలలో డీలర్ల ద్వారానే నిత్యావసర సరుకుల పంపిణికి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని హర్షిస్తూ పలమనేరు రూరల్, మండలంలోని డీలర్లు ఆర్డీవోను సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీలర్ల సంఘ నాయకులు యువరాజు విశ్వనాథ రెడ్డి, రెడ్డప్ప,మునిరత్నం, వినోద్, మోహన్ రామిరెడ్డి, బసవరాజు, నరసింహ రెడ్డి, రవిస్వామి, ప్రకాష్, గంగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ అసైన్డ్ భూములు పేదలకు పంచాలి

పౌర హక్కుల దినోత్సవ సమావేశంలో పలువురు డిమాండ్

ప్రజాశక్తి -సోమల: సదుం మండలంలోని పలు పంచాయతీలలో ప్రభుత్వ అసైన్డ్ భూములు పేదలకు పంచి వారిని అభివృద్ధి పథంలో తీసుకొచ్చేందుకు చర్యలు తీసుకోవాలని పౌర హక్కుల దినోత్సవం సమావేశంలో పలువురు డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన సదుం తహశీల్దారు కార్యాలయంలో తహశీల్దారు జయప్రకాష్ ఆధ్వర్యంలో పౌర హక్కుల దినోత్సవం శనివారం నిర్వహించారు. మిట్టపల్లి, ఊటుపల్లి, గాండ్లపల్లి, పాల మంద, సజ్జల వారి పల్లి, మార్తు వారి పల్లి గ్రామాల పరిధిలో భూ సమస్యలపై సమావేశంలో చర్చించారు. మండలంలో అనేకమంది దళితులు సొంత వ్యవసాయ భూములు లేక కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని వారందరికీ ప్రభుత్వ అసైన్డ్ భూములను పంపిణీ చేయడం ద్వారా దళితులు కూడా భూ యజమానులుగా మారి వ్యవసాయం చేసుకునే అవకాశం ఉందని మండల స్థాయి అధికారులు ఈ విషయాన్ని పరిగణనలోకి తీసుకొని వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ పనుల్లో దళితులకు పనులు కల్పించాలని, విద్యుత్ సమస్యలు, గ్రామాలలో మౌలిక వసతుల సమస్యలపై దృష్టి సారించాలని పలువురు విన్నవించారు. దళితుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన తహశీల్దార్ జయప్రకాష్ మాట్లాడుతూ సమావేశానికి తెలిపిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉషారాణి, ఎస్ఐ షేక్షావలి, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ అధ్యక్షులు సీతాపతి, కమిటీ సభ్యులు రాంబాబు, గంగాధర, నరసింహులు, నాగరాజ, వెంకటరమణ, ఆంజనేయులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పలువురు మాట్లాడుతున్న దృశ్యం

కూటమి ప్రభుత్వంలోనే చేయూత: ఎమ్మెల్యే

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: కూటమి ప్రభుత్వంలోనే అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల్లో చేయూత అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్ డాక్టర్ బి.ఎం థామస్ అన్నారు. గంగాధర నెల్లూరు మండలం వింజం దళితవాడలో ఒకరోజు ముందే ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను లబ్ధిదారులకు పంపిణీ చేసి, అనంతరం రైతులకు పశుదాణ బ్యాగ్‌లను అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే పేదలు సంతోషంగా జీవిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గ పరిధిలో సిఎం సహాయనిధి లబ్ది పొందిన వారికి చెక్కులను అందించారు. ఎస్ఎస్ కొండ వెటర్నరీ హాస్పిటల్ వద్ద పాడి రైతులకు పశుదాణ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడివో సతీష్, వెటర్నరీ ఏడి మురళి మోహన్, టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమనాయుడు, నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి పొన్న యుగంధర్, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షుడు శ్రీధర్ యాదవ్, మండల టిడిపి అధ్యక్షుడు స్వామిదాస్, పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి దేవ సుందరం, గ్రామ కమిటీ అధ్యక్షుడు సతీష్, నాయకులు హరీష్ యాదవ్, యువరాజారెడ్డి , సగి కుమార్ మురళి రెడ్డి, సోమ శేఖర్ రెడ్డి , బాలచంద్రారెడ్డి, దేవరాజులు పాల్గొన్నారు.

పశువుల దాణ అందిస్తున్న ఎమ్మెల్యే థామస్

ఘనంగా కృష్ణ జయంతి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : సూపర్ స్టార్ కృష్ణ జయంతిని చిత్తూరులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ, మహేష్ బాబు అభి మానులు పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు నిర్వహించారు. అభిమానుల సంఘం నాయకులు కేపీ శ్రీధర్, కొంబు, రావూరి రవి పాల్గొన్నారు.

IN THE COURT OF THE PRL. CIVIL JUDGE (SENIOR DIVISION), CHITTOOR
(in the matter of Matrimonial Jurisdiction)
H.M.O.P.No. 11 of 2024

Between:
B. Shirisha ...Petitioner
And:
B.Panedra Reddy ... Respondents

NOTICE TO RESPONDENT

To
B.Panendra Reddy, aged about 38 years, s/o late B. Sivasankar Reddy, Hindu, Mason, r/at 1-92, Godugumanupalle village, Gudyanampalli post, Penumuru Mandal, Chittoor District A.P.
Sir,
Please take notice that the above **H.M.O.P.No. 11 of 2024** is posted to **08-07-2025** for your appearance before the said court. Please be present on the said date before the said court at 10-30 A.M. either in person or through an Advocate and to raise objections if any, failing which the matter will be decided in your absence as ex-parte.
Hearing date: **08-07-2025**

Sd/- SRI V. NAGARAJA
Advocate,Chittoor.Cell No:6302046185

ప్రజా సంక్షేమమే లక్ష్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి- యాదమరి: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మురళీ మోహన్ అన్నారు. యాదమరి మండలం మోర్దానపల్లెలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామస్తులతో ఎమ్మెల్యే సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యమని, గ్రామాల్లో మౌలిక మౌలిక అవసరాను గుర్తించి పరిష్కరిస్తున్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు సమస్యలు స్థానిక నాయకు లకు, తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదమరి మండల టిడిపి అధ్యక్షులు మురార్జీ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్ రబ్బీ, చిత్తూరు జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి అమరనాథ్ నాయుడు, మండల, స్థానిక నాయకులు, కార్యకర్తలు, మోర్ధానపల్లె గ్రామస్తులు పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

వెదురుకుప్పం: వెదురుకుప్పం మండలం పాతగుంట పంచాయతీలో వెదురుకుప్పం టిడిపి మాజీ మండల అధ్యక్షులు క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్ మురళి, పంచాయతీ కార్యదర్శి ఉమశంకర్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ మునిజ్యోతి, చంద్రబాబురెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు మునికృష్ణారెడ్డి, సచివాలయ సిబ్బంది కార్తీక్, టిడిపి నాయకులు అమరనాథరెడ్డి, తిరుపాలరెడ్డి, జనసేన నాయకులు యతీశ్వర్ రెడ్డి, వెంకటప్పశెట్టి, జయరాం పాల్గొన్నారు.

సమస్యలపై విచారిస్తూ.. పింఛన్లు అందిస్తూ..

కుప్పం టౌన్ : కుప్పం పట్టణంలో టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు సామాజిక పింఛను అందిస్తూనే స్థానిక సమస్యలను సైతం అడిగి తెలుసుకున్నారు. శనివారం ఆయన పట్టణ పరిధిలోని మురుగన్ థియేటర్ రోడ్డులోని యానాదుల నివాస ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా పింఛన్లు పంపిణీ చేశారు. స్థానిక సమస్యలపై అక్కడి ప్రజలను విచారించి, సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక టిడిపి నాయకులు, సచివాలయ, పురపాలక సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న డాక్టర్ సురేష్‌బాబు

కార్వేటినగరం : కార్వేటినగరం పంచాయతీ వడిండ్లులో ఒక రోజు ముందుగానే ఎన్టిఆర్ భరోసా పెన్షన్ ఎంపీడీవో టి.చంద్రమౌళి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇవోపిఆర్డి నాగరత్నమ్మ, చిత్తూరు పార్లమెంట్ మైనారిటీ సెల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షేక్ సందని, విఆర్వో తేజ పాల్గొన్నారు.

రామకుప్పం: మండలంలోని బందార్లపల్లి పంచాయతీ బిరుగుండ్లపల్లి గ్రామంలో రెండు నెలల పెన్షన్ 8 వేలు నగదును టిడిపి మండల అధ్యక్షుడు ఆనంద రెడ్డి, రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి నేతలు, కార్యకర్తల తో కలిసి పంపిణీ చేశారు. శనివారం ముద్దనపల్లి, రామకుప్పం, బగళనత్తం, బిరుగుండ్లపల్లి, ఆనిగనూరు , కొంగనపల్లి, ఎస్ గొల్లపల్లి, పీఎంకే తండా తదితర గ్రామాల్లో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీతాపతి, రామ్మూర్తి, చిన్న కృష్ణ, చలపతి,రామకృష్ణప్ప, గంట్లప్ప గౌడు, మహమ్మద్ రఫీ, సలాం సాబ్ రఘు పాల్గొన్నారు.

కార్మికులకు అండ : సిఐటియు



ప్రజాశక్తి -పలమనేరు: భారతదేశంలో ఉన్న అన్ని వర్గాల కార్మికుల సమస్యలపై పోరాటం చేసి వారి కష్టాలు పరిష్కరించేది సిఐటియు జెండానే అని సిఐటియు జిల్లా అధ్యక్షుడు గిరిధర్ గుప్త తెలిపారు. మే నెల 30 వ తేదీ సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయం ముందు జెండా ఆవిష్కరించారు. కార్మికులలో కుల, మత ప్రాంత భేదాలు లేకుండా దేశ సమైక్యత నింపుతూ, కార్మిక వర్గ రాజ్య స్థాపన లక్ష్యంగా, కార్మిక వర్గ కష్టాల విముక్తి ధ్యేయంగా సిఐటియు పోరాటాలు చేస్తోందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి సావిత్రమ్మ , పీహెచ్సీ ఆశ వర్కర్స్ కైరుని , ధనమ్మ బిల్డింగ్ కార్మికుడు ప్రతాప్, రవి కార్మికులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION)CUM JUDICIAL MAGISTRATE OF 1 ST CLASS AT PAKALA
E.P.No.40 OF 2023 O.S.65 Of 2019 (2 Nd Additional JCJ Court ,Chittoor)

Between:
D.Nageswara Naidu **...Decree Holder**
And
P.Jagadeesh **....Judgement Debtor**

NOTICE TO THE JDr UNDER ORDER 21 RULE 22 OF CPC

To.
P.JAGADEESH S/O P.Venkataswamy Naidu Ram Nagar Colony Near S.C.Boys Hostel Puthalapattu Town and Mandal,Chittoor-Dist.
Sir,
Please take notice that the above E.P is filed by the Decree Holder against you for the attachment and sale of E.P schedule property and the same is posted to Dt.20-06-2025 for your presence.Therefore be present on that day either in person or through your advocate before the above court by 10-30 a.m.and file your objections if you have any,failing which the above matter will be decided ex-parte.

N.PRAVEENA PRAKASH M.B.A.,L.L.M.,
ADVOCATE, PAKALA